# పడిలేచిన కెరటం

**- గంటి భానుమతి**



*(గత సంచిక తరువాయి)*

**శృతీ, మొదలు పెట్టు**,అని లోపల్నించి ఎవరో అంటున్నారు. ఆ ఎవరో నాకు తెలుసు. అది నా అంతరాత్మ. ఇన్ని రోజులూ పాస్సివ్ గా ఉండిపోయాను. ఇవాళ ఈ రిక్రియేషన్ గదిలో వీటిని చూసేసరికి ఏదో చేయాలన్న ఉత్సాహం కలుగుతోంది.

అంతే. మొదలు పెట్టాను.వణుకుతున్న బ్రష్ ని పేపర్ మీద పెట్టాను. ఏదో వేస్తున్నాను. అది ఏంటో చూడ దలుచు కోలేదు. అలా వేస్తూ పోయాను. నేనెక్కడున్నానో  నాకు తెలీదు.చుట్టూ ఏం ఉందో, ఎవరున్నారో చూడడంలేదు. రంగులు ఒక దాని తరవాత లేయర్లు లేయర్లుగా వేస్తున్నాను. ఎంత సేపో తెలీదు. ఎలా వచ్చిందో ఒక్కసారి కూడా ఆ రంగుల్ని చూడలేదు.

కాళ్ళు నొప్పిపెట్టడం లేదు. నడుము వంచి అలా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాను. ఎవరో నా వెనక చిన్నగా మాట్లాడు కుంటున్నారు. అయినా నేను వెనక్కి  తిరగ లేదు , ఎవరో ఉన్నట్టుగా అనిపించింది. వేయడం పూర్తయ్యాకా  వెనక్కి తిరిగాను.

ఓ ఇద్దరు సన్నగా పొడుగ్గా చామన ఛాయతో, జీన్స్ టీషర్టుతో ఉన్నారు. వయసుని అంచనా వెయ్యలేను. ఇక్కడ వయసుదేం ఉంది. నాకు ఆ రోజు మొదటి రోజు కాబట్టి, అంతకు ముందు వాళ్ళనిచూసే  అవకాశం లేదు, కాబట్టి వాళ్ళని నేను చూళ్ళేదు,

వాళ్ళిద్దరూ నాకు కుడిపక్క గా ఓ రెండు అడుగుల వెనక నుంచుని నిశ్శబ్దంగా చూస్తున్నారు.

“ ఓ పెయింటింగ్ ని, కలర్, టెక్స్చర్ హైలైట్ చేస్తాయి. ఇదే కిటికీ, ఇదే చెట్టు, ఇదే బాక్ గ్రౌండ్ తో ఎంత మంది వేసినా బాగానే ఉంటుంది. “  అంటున్న వాళ్ళ మాటలు నా వెనకాల నుంచి వినపడ్డాయి.

నేను వేస్తున్నదానికి ఎవరో ప్రేక్షకులుండాలని అనుకోలేదు. మెచ్చుకోవాలని కూడా అనుకోలేదు. వాళ్ళ మాటలకి ఏం అనాలో తెలీలేదు. డాక్టరు గారితో తప్ప మరెవరికీ జవాబులివ్వని నేను, ఎలా రెసిప్రొకేట్ చెయ్యాలో మర్చిపోయాను.

ఇలాంటి పొగడ్త కి ఏం అనాలో ఎలాంటి జవాబివ్వాలో వెంటనే గుర్తు రాలేదు. కాస్సేపయ్యాకా గుర్తు తెచ్చుకుని, ”థాంక్యూ” అన్నాను.

థాంక్స్ చెప్పాను కదా అని వాళ్ళిద్దరూ మాటలు పొడిగించారు. కాసేపు పేయింటింగ్ , దానికి వేసిన రంగుల గురించి గురించి మాట్లాడారు.

వాళ్ళకి పెయింటింగ్స్ గురించి,పెయింటర్ల గురించి చాలా తెలుసనుకుంటాను, నందలాల్ బోస్, అవనీంద్ర నాథ్ టాగోర్,రవీంద్ర నాథ్ టాగోర్, రాయ్ చౌదరీ ల ఎక్కువ బెంగాలీ చిత్రకారుల గురించి మాట్లాడు కుంటున్నారు. వాళ్ళ గురించి చెప్తున్నారు. నాకు వాళ్లెవరూ తెలీదు. అయినా వాళ్ళ మాటలు వింటున్నాను.

చాలా రోజుల తరవాత నా గూడు లోంచి బయటికి వచ్చాను. బయటి ప్రపంచంలో ఉన్న మనుషులతో మాట్లాడగలుగుతున్నాను. అంతేకాదు నాపేరుని వాళ్లు అడిగితే చెప్పుకున్నాను. అంటే నా పేరు నాకు గుర్తుంది.

“ఇప్పుడు టైము పన్నెండు దాటింది. ఇది లంచ్ టైము,వెళ్దామా ” అంటూ కదిలారు ,వాళ్ళిద్దరు . అది నాకు కూడా వర్తిస్తుంది. నా చేతిలో ఉన్న వి పక్కనున్న టేబుల్ ఉంచి ,చేతులు తుడుచుకున్నాను. వాళ్ళ వెనకాలే వెళ్ళాను. ఎక్కువ దూరం వెళ్ళ కుండానే డైనింగ్ రూం కనిపించింది.

డైనింగ్ రూం అంటే ఓ పెద్ద గది లా ఉంది. ఓ పక్కన వండిన వన్నీ ఓ పొడుగాటి టేబుల్ మీద పెట్టి ఉన్నాయి. ఇన్ని రోజులు నా తిండి గురించి నేను పట్టించుకోలేదు. ఏం తిన్నానో నాకు తెలీదు. అమ్మ ఏం తెస్తే అదే తినేదాన్ని. ఆమెకి ఏం బావుంటుందని అనిపిస్తే ,ఓ కంచం లో పెట్టేది. స్కూలుకి వెళ్ళే రోజుల్లో కూడా అంతే. అమ్మఏది వండితే అదే. అమ్మ ఏది పెడితే అదే. వాళ్ళ ఛాయిస్ తో ఏది తెస్తే అదే తిన్నాను.

కాని ఇప్పుడు ఇక్కడ రకరకాలున్నాయి. నాకు కావలసినది , నాకు ఇష్టమైనది , నేను వడ్డించు కోవచ్చు.

ఓ ప్లేటు తీసుకుని అన్నం కూర వేసుకున్నాను. కంచం లోకి చూసాను. కంచం మధ్యలో అన్నం పక్కనే కూర. తెలుపు ఆకుపచ్చ, కలర్ ఫుల్ గా కంచం. కళ్ళకింపుగా ఉంది. నేనేం తింటున్నానో కూడా చాలా రోజుల తర్వాత చూస్తున్నాను.

ఇన్ని రోజులూ తిన్నాను కాని నేను జీవించడానికి మాత్రమే తిన్నాను. కాని ఇప్పుడు ఏం తింటున్నానో చూస్తున్నాను. మెల్లిగా తినడం మొదలు పెట్టాను. అన్నీ రుచిగా న్నాయి. అమృతం తింటున్నాను. నా ప్లేటు తీసుకుని వాళ్ళిద్దరి దగ్గరికి వెళ్ళాను. వాళ్ళు చిన్నవాళ్ళు కారు. ఓ నలభై ఏళ్ళున్న వాళ్ళల్లాగా అనిపించారు. జుట్టు అక్కడక్కడా తెల్లబడింది.

వాళ్ళిద్దరూ పెయింటింగుల గురించి మాట్లాడడం విన్నాను. ఇప్పుడు సినిమాల గురించి పాటల గురించి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు అన్ని సినిమాలు చూస్తారని, వాళ్ళిద్దరూ పుస్తకాలు బాగా చదువుతారని వాళ్ళ మాటలని బట్టి అర్థం అయింది. నేను కూడా అంతే,స్కూల్లో ఉన్నప్పుడు వార పత్రికలూ,మాస పత్రికలూ చిన్న పుస్తకాలూ,స్కూలు లైబ్రరీలో కూచుని చదివే దాన్ని.

మా ఇంట్లో పుస్తకాలు అవీ తెప్పించే వారు కాదు. క్లాసులో లంచ్ టైములో సినిమాల గురించి,పాటల గురించి,మాట్లాడుకునే వాళ్ళం. ఇంక ఇంటరు నుంచి అన్నీ బంద్. ఇంటికి పేపరు మాత్రం వచ్చేది. దాన్ని చదివే సమయం ఉండేది కాదు.ప్రేయర్ లో ఆరోజు న్యూస్ చదివే నా వంతు అయితే హెడ్ లైన్స్ రాసుకుని వెళ్లి చదివే దాన్ని.

కానీ క్లాసు పుస్తకాల్లోని కవుల గురించి ,సాహిత్యం గురించి స్కూల్లో,కాలేజీలో మాట్లాడుకునే వాళ్ళం. ఎందుకంటే అలా డిస్కస్ చేస్తే బాగా గుర్తుంటుంది, పరీక్షల్లో మాకు రాయడం ఈజీగా ఉండేది. మళ్ళీ ఇన్నాళ్ళకి ఇప్పుడు వీళ్ళతో మాట్లాడుతున్నాను. అన్నీ ఒక్కొక్కటే గుర్తొస్తున్నాయి, కానీ ఇప్పుడు,మాత్రం విన్నదే ఎక్కువ. వాళ్ళిద్దరే చాలా సేపు మాట్లాడారు..

అంత సేపు కలిసి ఉన్నాం. కానీ నేనిక్కడ ఎందుకున్నానో ఎవరూ అడగ లేదు. నేను కూడా వాళ్ళని అడగలేదు. నాలాగే అందరికీ పైకి చెప్పుకోలేని, చెప్పుకోడానికి ఇష్టపడని,గతం ఉందా,అంతే అయి ఉంటుంది. ఎందు కంటే నా గతం ఇక్కడ ఎవరికీ తెలీదు అని నాకు నమ్మకం ఉంది. ఇతరులకి తెలియనంత సేపూ, నేను ఎవరో తెలవనప్పుడు , నాకు నామీద గట్టి నమ్మకం,అదే మాకు రక్షణ, ఎవరికీ తెలియక పోవడం నన్ను సురక్షితంగా ఉంచింది.

వాళ్ళతో మాట్లాడుతూ,నవ్వుతున్నాను.మాట్లాడుతూ తినడం వల్ల అన్నం కూడా ఎక్కువే తిన్నాను. చాలా రోజుల తరవాత,భోజనం చేసాకా ఆయాసం గా అనిపించింది.

గదిలోకి వచ్చాకా మంచం మీద పడుకున్నాను. ఆ రోజున నేను చూసిన వాళ్ళ గురించి ఆలోచిస్తున్నాను. అందరూ పైకి మామూలుగా ఉన్నారు. వాళ్ళకి మానసిక వైకల్యం ఉన్నట్టు

కనిపించడం లేదు. మరి నేను కూడా అంతేనా బయటి వాళ్ళకి మామూలుగా కనిపిస్తానా !

ఎప్పుడో నిద్ర పట్టేసింది. చాలా ప్రశాంతమైన నిద్ర. చాలా రోజుల తరవాత మంచి నిద్ర.

ఇది వరకూ ఎప్పుడూ మత్తుగా ఉండేది .ఇప్పుడు అలా కాదు. ఎంత నిద్ర పోవాలో అంతే పోతున్నాను..

తలుపు మీద ఎవరో టక టక మని కొడ్తూంటే బలవంతంగా కళ్ళు తెరిచాను. కళ్ళు తెరిచానే కానీ నేనెక్కడున్నానో తెలుసుకోడానికి టైం పట్టింది. తలుపు యెవరు కొట్టారో అని వెళ్ళి తలుపు తీసాను. అందరూ కారిడార్ లోంచి వెళ్తూ కనిపించారు.”సాయంకాలం.గదిలో ఉండద్దు, బయటికి రావాలి “అని అన్నారు.

నన్ను గౌరవిస్తూ రమ్మని పిలుస్తున్నారు.వెళ్ళక పోతే బావుండదు. నన్ను నేను అగౌర పర్చుకున్నట్లు అవుతుంది.వెళ్ళాలి. నన్ను నేను చూసుకున్నాను. పంజాబీ డ్రెస్ లో ఉన్నాను.

అది బాగానే ఉంది, కాని కాటన్ కాదు.బట్టలు మార్చుకోవాలి. మొహం కడుక్కోవాలి. కాస్త తయారవ్వాలి. ఇదివరకు నామీద శ్రద్ధ తక్కువగా ఉండేది. డాక్టరుగారు అన్నారు కదా నవ్వితే బావుంటానని. అందుకని అద్దంలో నవ్వుతూ మొహం చూసుకుంటూ తయారయ్యాను. నా జుట్టుని బాగా దువ్వి, పైకి కట్టాను. నూలు బట్టలు వేసుకుని వెళ్ళాను.

ఓ చోట బాడ్మింటన్ ,ఆడుతున్నారు. ఓ నలుగురు వాకింగ్ చేస్తున్నారు.

నేను ఏంచెయ్యాలి ? స్కూల్లో ఉన్నప్పుడు ఆటల పీరియడ్ లో బాగా ఆటలు ఆడేదాన్ని. అంతే నిజానికి మా ఇంట్లో ఆటలని ఎప్పుడూ ఎంకరేజ్ చెయ్యలేదు. అందుకే నాకు ఏ ఆట కూడా రాదు.

అమ్మ వద్దనేది. అదంతా టైం వేస్టనేది. ఆ టైంలో చదువుకుంటే మరో రెండు మార్కులైనా వస్తాయనేది. నేను కూడా పెద్దగా అడిగే దాన్ని కాదు.

ఇంక ఇంటర్ లో అయితే ఆటలనేదే లేదు. అది టైం వేస్ట్ అని మానేజిమెంట్ ఉద్దేశం .పైగా ఆటలకోసం అని ప్రత్యేకంగా ఏం లేదు. అందుకే నేను ఏ ఆట ఆడినా స్కూల్లో ఉన్నప్పుడే. ఇప్పుడు ఆడగలనా ప్రయత్నిస్తాను.

ఇప్పుడు ఇక్కడ అన్నీ చూస్తూ తిరిగుతూంటే , స్కిపింగ్ తాళ్ళు కనిపించాయి. అది తీసుకుని కాస్సేపు స్కిపింగ్ చేసాను. ఎవరో రింగ్ ఆడుతూంటే అది ఆడాను. నేను మళ్ళీ మామూలుగా అవుతున్నాను. బాగా అలసి పోయాను. ఓ చోట అంశమాన్, షమీ బాడ్మింటన్ ఆడుతూ కనిపించారు. వాళ్ళిద్దరూ నాకు అక్కడే పరిచయం అయ్యారు. వాళ్ళ పేర్లు వాళ్ళు చెప్పుకున్నారు. నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళాను. నాకు ఆట కాస్త నేర్పించారు. కాస్సేపు ఆడాను. బాగా అలిసి పోయాను. అక్కడ కోర్టులోనే ఓ వారన కింద కూచున్నారు. నేను వాళ్ళ దగ్గరికెళ్ళి కూచున్నాను.

వాళ్ళిద్దరూ ఆటల గురించి, క్రికెట్ గురించి , ఒలంపిక్స్ గురించి, చాలా సేపు మాట్లాడారు,అవన్నీ నాకు తెలీదు కాబట్టి ఎంతో ఆసక్తితో విన్నాను.

అంశుమాన్ మా అందరిని చూస్తూ అన్నాడు. "మా ఫాదర్ కొన్ని పుస్తకాలు పంపారు. అందులో యాంద్రె అగాస్సి , నడాల్ రాసిన పుస్తకాలు కూడా ఉన్నాయి, ఆ రెండూ నేను చదివే సాను. ఎవరైనా కావాలంటే తీసుకోవచ్చు, రాత్రి డిన్నర్ లో కలిసినప్పుడు తెస్తాను. అప్పుడు తీసుకోవచ్చు"

స్కూలులో ఉన్నప్పుడు లైబ్రెరీ కి వెళ్ళినప్పుడు బాగా చదివాను. ఇంక ఇంటర్ లోకి వచ్చాకా ఈ ఎంసెట్ మూలంగా మంచి పుస్తకాలు చదవలేక పోయాను. బీఎస్సీ లోకి వచ్చాకా అలవాటు తప్పింది. బీఎస్సీ ఫైనల్ హైద్రాబాదు కాలేజీలో చేరినప్పుడు, కోచింగ్ క్లాసుల నుంచి వస్తూ తెచ్చుకుని చదివేదాన్ని, మళ్ళీ ఇన్నాళ్ళకి ఇప్పుడు మళ్ళీ ధ్యాస మళ్ళుతోంది . ఇప్పుడు పూర్వపు రోజులు వస్తాయా ? నేను చదవడమే మానేసాను కదా, మళ్ళీ చదవగలనా? అంశమాన్ చెప్పిన పుస్తకాలు చదవగలనా ? చదవలేకపోతే! ఇంక వీటిని , ఇలాంటి గొప్ప పుస్తకాలని ఇంక ఈ జన్మలో చదవలేనా. ఏం చెయ్యాలి ?

అంతకు ముందే డాక్టరు గారికి నా భయం చెప్పాను. ఆయన ఆ లోటు పూర్తి చేస్తామని అన్నారు.

అదే కనక జరిగితే నా అంత అదష్టవంతులు ఉండరు. నేను నా ఆలోచనల్లో ఉన్నప్పుడు, వాళ్ళు

బయోగ్రఫీ ల గురించి మాట్లాడుకున్నారు. గాంధీ ,నెహ్రూ ల నుంచి, ఇప్పటి హైద్రాబాదీ లక్ష్మణ్ వరకూ, ఎంతో మంది గురించి మాట్లాడారు. నాకు ఈ సంభాషణలు చాలా నచ్చాయి. ఎందుకంటే వాళ్ళు మాట్లాడుతున్నది నాకు తెలియనిది. వాళ్ళ సాంగత్యంలో ఎన్నో నేర్చుకున్నాను. ఎన్నిరోజులయిందో బాగా చదువు కున్న వాళ్ళ మాటలు విని. ఈ క్షణాన వాళ్ళ మధ్య ఉన్నాను. నేను ఇక్కడ ఉండడం కూడా ఓ విధంగా మంచిదే అయింది అనిపించించింది.

ఆ రోజు డాక్టరు పాల్ గారు వస్తారేమో అనుకున్నాను. కాని ,రాలేదు.మరో డాక్టరు వచ్చారు. నేను మామూలుగా టైం టేబుల్ లో ఉన్నట్లుగా కౌన్సిలింగ్ , సైకో థెరపీ గదిలోకి వెళ్ళాను. అక్కడ టేబుల్ మీద చిన్న బోర్డు, దానిపైన డా.పూర్వి దేశాయ్ అని ఉంది.

నేను గదిలోకి వెళ్ళగానే ఆమె నవ్వుతూ నన్ను పలకరించింది, ఓ కాటన్ చీర. క్లోజ్ నెక్ జాకెట్, చాలా హుందాగా ఉంది. ఒక్కసారి ఎలా గుర్తొచ్చిందో, తెలీదు కానీ,ఇంటర్ లో మా బాటనీ లెక్చరర్ , పేరు గుర్తు రావడంలేదు కానీ, ఆమె కూడా ఇలాగే కాటన్ చీరలు కట్టుకుని చిన్న మెడ ఉన్న బ్లౌజులు వేసుకునేది. ఇప్పుడు ఆవిడ ఎందుకు గుర్తొచ్చిందో అర్థం కాలేదు. కానీ ఒక్కటి మాత్రం స్పష్టం అయింది. నేను ఏదీ మర్చి పోలేదు. అన్నీ తాత్కాలికంగా ఎక్కడో వెనక్కి వెళ్ళి పోయాయి. సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టీ , ఎప్పుడో

జరిగిపోయినవి, ఒకప్పటివి అన్నీ అడుక్కి వెళ్ళిపోయినవి  మెల్లిగా ఒకొక్కటిగా పైకొస్తున్నాయి. మామూలుగా పూర్వ శృతిలా అయిపోతున్నాను. పాజిటివ్ గా ఉండమన్నారు కదా. నాకేం కాలేదు అని అనుకోమన్నారు కదా. ఇప్పుడు అలాగే అనుకుంటాను.

“హలో శృతీ, నేను నీ కౌన్సిలర్ ని ” అని అనగానే ఈ లోకం లోకి వచ్చాను.

” హలో, మేడం ” అన్నాను. నాకేం కాలేదు అని అనుకున్నా ,కౌన్సిలర్ నా ఎదురుగా ఉండడంతో నేను మామూలుగా లేను అని వాళ్ళు అనుకుంటున్నారు.

అందుకే ఈ కౌన్సిలర్ ముందు కూచున్నాను. ఒక్కసారి మనసు ములిగింది. ఆమె వైపు చూసాను.

ఆమె ముందు నా ఫైలుంది. ఆ ఫైలు నాది. అందులో నా జీవితం.

“శృతీ ,మేము ఇక్కడ నీకు అన్ని విధాలా తోడ్పడడానికి ఉన్నాం.  నువ్వు బాగా ప్రోగ్రెస్ అవుతున్నావు. ఇంకొన్ని రోజుల్లో పూర్తిగా మామూలుగా  అయిపోతావు ”

అలాగా అన్నట్లు తల ఊపాను. కాని నాకు కోపంగా ఉంది. ఆమె నా ఫైలు తీసింది.  చూసింది అంటే ఆమె నా జీవితాన్ని చదివింది. నా గత జీవితంలోని ప్రతీ చిన్న విషయం ఆమెకి తెలిసిపోయింది.

డాక్టర్ పాల్ గారితో నాకేం అభ్యంతరం ఏం లేదు. కాని, ఈ డాక్టరుకి ఆ అధికారం ఏం లేదు. ఈమె నా మనసుని , నా మైండుని చదివింది. కాదు చదివేసింది.

“ డాక్టర్ పాల్ గారికి,మీ కేసు మీద చాలా ఇంట్రెస్ట్ ఉంది ”

“ కాని ఆ డాక్టర్ గారు రాలేదు కదా ”

“వస్తారు, ఆయన వచ్చే వరకు నేను నీతో మాట్లాడుతాను. నీ గురించి మనం మాట్లాడుకోనక్కర్లేదు మనం సినిమాల గురించి, పాటల గురించో, కథల గురించో ఏదైనా సరే. నీకు ఏది ఇంట్రెస్టో దాని గురించి  లేకపోతే హీరో , హీరోయిన్స్ , కమెడియన్స్,  గురించి మాట్లాడుకుందాం ”

ఆమె మాటలకి ఏం అనాలో తెలీలేదు. ఈమెతో మాట్లాడాలని నాకు లేదు. ఇప్పుడు నాకు దేని మీదా ఇంట్రెస్ట్ లేదు. ఆమె నా వైపు ఓసారి చూసి ,  నా ఫైలు తీసి చూస్తోంది..

“సరే అయితే , డాక్టరు గారు వస్తారు ”

“ నేను కూడా డాక్టర్ గారు వచ్చే వరకూ ఆగుతాను ” అని అన్నాను.

ఆమె ఏం మాట్లాడ లేదు. అటూ ఇటూ చూసింది.

ఓ పావు గంట తరవాత,డాక్టరుగారు వచ్చారు. ఆమె పాల్ గారితో జరిగినదంతా చెప్పినట్లుంది.

" శృతీ, ఇక్కడ పని చేసే డాక్టర్లందరూ బాగా ట్రెయిన్ అయిన వాళ్ళు. ఆక్యుపేషనల్ థెరపీలో ట్రెయినింగ్ చేసిన వాళ్ళే. పూర్వి చాలా మంచి వ్యక్తి. నేనే ఆమెను నీ కోసం అసైన్ చేసాను. నీ ఫైలు బాగా చదివింది ,అర్థం చేసుకుంది "

" కావచ్చు డాక్టర్, కానీ నేను ఆమె దగ్గర కంఫర్ట్ గా లేను "

నా మాటలు విన్నాకా డాక్టర్ పూర్వి వెళ్ళిపోడానికి ,వెనక్కి తిరిగారు.

అది చూసాకా అనిపించింది. అలా అనకుండా ఉండాల్సిందని.

"ఓకే. నీతో ఓ విషయం మాట్లాడాలి. డాక్టర్ పూర్వీ మీరు కూడా ఉండండి " అని ఆమెని ఆపారు.

"ఈ డాక్టరు గారు కూడా ఇక్కడే ఉంటారు. వింటారు . ఆమె కి కూడా నీ గురించి పూర్తిగా తెలియాలి కదా. ఇంకో విషయం శృతీ, నువ్వు మర్చిపోయావు నీలో ఓ అద్భుతమైన కళ ఉంది. నువ్వు చాలా టాలెంటెడ్. చాలా బాగా కవిత్వం రాయగలవు. దాన్ని డెవలప్ చేసుకుంటే బావుంటుంది. పెయింటింగ్స్ కూడా అంతే. బావున్నాయి నీకంటూ ఉన్న ఓ చక్కటి కాలక్షేపాన్ని డెవలప్ చేసుకుంటే నువ్వు ఈ డిప్రెషన్ నుంచి బయట పడతావు. నువ్వు మామూలుగా అవడానికి మేము చేస్తున్న ప్రయత్నాలకి ,ట్రీట్ మెంటుకి నీ వంతుగా నువ్వు మాకు సాయం చేసినట్లవుతుంది. సరేనా "

నేను కవిత్వం రాస్తానని ఇతని కెలా తెలుసు ? పెయింటింగ్స్ అంటే అర్థం ఉంది, నేను వేసిన దాని గురించి విని,వాటిని చూసి ఉంటాడు.

మరి నేను రాస్తానని , ఎలా తెలిసింది, అన్నట్లు గా డాక్టరు గారిని చూసాను. ఆయనకి నా భావం అర్థంఅయింది.

"ఎలా తెలుసని అనుకుంటున్నావా! నీ ఫ్రెండుకి నువ్వు రాసిన ఉత్తరం. అది ఒకటి కాదు ,రెండు కాదు, ఏకంగా ఓ ముప్పైపేజీల ఉత్తరం చూసాను. అది పేరుకి ఉత్తరం కానీ అందులో కవిత్వం ఉంది. అది ఓ దీర్ఘ కవితలా ఉంది " అని నా వైపు చూసారు.

నేనా ఎప్పుడు రాసానూ! ఆలోచిస్తున్నాను. ఎవరికి రాసాను? తెలీడంలేదు..

" గుర్తు తెచ్చుకో " అంటూ ఆగారు నన్నే చూస్తూ.

" సారీ ఎవరికి రాసానో తెలీదు నాకు గుర్తు లేదు " తలని అడ్డంగా ఊపుతూ అన్నాను.

" పరవాలేదు. నేను గుర్తు చేస్తాను. ఆ అమ్మాయిపేరు సువర్ణ. హైదరాబాదు రాకముందు,నువ్వు ఇది వరకు చదివిన కాలేజీ బీఎస్సీలో నీ క్లాస్ మేట్ "

అయినా గుర్తు రాలేదు.

" ఓకే మరో చాన్స్, ఆమె ఫొటో చూపిస్తాను " అంటూ తన తెల్ల కోటు జేబులోంచి ఓ కవర్ తీసి అందులోంచి ఓ ఫొటోని తీసి నా చేతిలో పెట్టారు.

అది చిన్నదైతే చెప్పలేను.  కానీ అది నా అరచెయ్యంత సైజులో ఉంది. చాలా సేపటికి గుర్తుకొచ్చింది. సువర్ణ . అడుగు పొరలని చీల్చుకుంటూ పైకొచ్చింది. గుర్తొచ్చింది. సువర్ణ. నా స్నేహితురాలు. ఇది ఆమెకు నేను రాసిన ఉత్తరం. ఓ రాత్రి , నిద్ర పట్టక పోతే కూచుని రాసేసాను. ఉత్తరం అంటే అది ఉత్తరంలా లేదు. నా మనసులో ఉన్నది రాసాను. అందుకే కావచ్చు దీర్ఘ కవితలా ఉందని డాక్టరు గారు అన్నారు. అది నేను సువర్ణ కి రాసినదే . అందులో ఏం ఉందో నాకు గుర్తు లేదు. ఇప్పుడు నేను దాన్ని చదవ లేను.

ఇప్పుడు అది పైకి వచ్చింది. పైకి రావడం కాదు, ఊరు కూడా దాటింది. డాక్టరు గారి దగ్గరికి వచ్చింది. అంటే నా విషయం సువర్ణకి కూడా చెప్పేసారా !

ఎవరికీ చూపించద్దు అని రాసినట్లు గుర్తు. చూపించడం కాదు ,అది యేకంగా ఉత్తరం ఇచ్చేసింది. అది నన్ను మోసం చేసింది. దాన్ని వీళ్ళ కి ఇచ్చినట్లుంది. వీళ్ళకెందుకు ఇవ్వాల్సివచ్చింది? మరోసారి, నా గతం చెప్పుకోడం అవుతుంది.

నన్ను నేను బంధించుకున్న తాళ్ళని  నేను విప్పుకోక తప్పడం లేదు. ఇప్పుడు నా గురించి పూర్తిగా తెలిసి పోయింది. మరో పొర తీస్తున్నాను. ఇంతవరకూ వచ్చాకా నేను దాచగలిగింది ఏం లేదు. అయినా ఇది నాకు మేలు చేస్తుందనే నమ్మకం ఉంది.

“ ఈ ఉత్తరం మా దగ్గరికి ఎలా వచ్చిందో అని అనుకుంటున్నావా. నీ గురించి తెలుసుకోడానికి మీ నాన్నగారు,ఇది వరకు మీరున్న ఊళ్ళో నీ స్నేహితుల దగ్గరికి వెళ్ళి కనుక్కున్నారు.

మీరు హైద్రాబాదు వచ్చాక , నీలో జరుగుతున్న మార్పులు . ఎవరితో మాట్లాడక పోవడం, ఒంటరిగా ఉండడం, ఎక్కువగా కోపం తెచ్చుకోవడం, ఇవన్నీ మీ వాళ్ళని చాలా భాధపెట్టాయి. దీనికి తోడు నువ్వు చేసిన ఆత్మహత్యా ప్రయత్నాలు అంతులేని దుఃఖాన్నిచ్చింది. తమ ఎదురుగా కూతురు ఛావాలని చేస్తున్న ప్రయత్నాలు కన్న వాళ్ళకి ఎంత పెద్ద దెబ్బ. అప్పుడు మీ నాన్నగారు ఇదివరకూ ఉన్న ఊరు వెళ్ళారు. నీ స్నేహితురాలిని కలిసారు. ఆ సమయంలో ఆమె ఇచ్చిన ఈ ఉత్తరం యొక్క ఫొటోకాపీ నాకు పంపారు. దాన్ని మేము నీ ఫైల్లో పెట్టాము.

ఇంతకు ముందు నిన్ను చూసిన డాక్టర్లు ఓ మామూలు డిప్రెషన్ కి ట్రీట్ చేసారు.  నీ కేసు వేరు, మామూలుగా పుస్తకాల్లో, ఉండేది రెఫరెన్స్ కోసం,  వాడే  కేసులు వేరు.   నెట్ లో కనపడే కేసు కూడా కాదు. అందుకే నిన్ను ఇంతకు ముందు చూసిన డాక్టర్లు వేరే దారిలో వెళ్ళి, నీకు చేసిన వైద్యం పనికి రాలేదు ”

అతని మాటలని నేను నిశ్శబ్ధంగా వింటున్నాను.

నేను సువర్ణ కి రాసిన ఉత్తరాన్ని ఈ డాక్టర్లు పూర్తిగా చదివి, దాన్ని ఓ సర్జరీ చేసినంతగా పరీక్ష చేసి చర్చించుకుని ,నా లోని లోపాన్ని ఎనలైజ్ చేసి, దానికి ఓ మెడికల్ టర్మ్ ఇచ్చి, సైకాలజికల్ డిసార్డర్ మానిక్ డిప్రెషన్ అని కనుకున్నారు. దానిని ఎలా నయం చేయాలో అన్నీ ఆలోచించుకుంటున్నారు.

“శృతీ నువ్వు రాసిన ఉత్తరం మాకు చాలా ఉపయోగ పడింది. నీలో జరుగుతున్న మార్పులు అన్నీ తెలుసుకున్నాం. వైద్యం కూడా ఆ దిశగానే ఇస్తున్నాం. ఇవన్నీ నిన్నుమామూలుగా   చేసేందుకే. నీ ఉత్తరం మా దగ్గరికి వచ్చిందని, దాన్ని మేము చదివాము అని నువ్వు బాధ పడక్కర్లేదు ”

నా ఆలోచనలని కనిపెట్టినట్టున్నారు.అందుకే ఆవిధంగా మాట్లాడారు.

"నువ్వు ఇన్నాళ్ళూ జీవితాన్ని ఫీలవడం మానేసి, భరించడానికి అలవాటు పడ్డావు, నిన్ను నువ్వే కష్ట పెట్టు కున్నావు, ఓ ప్రపంచం లో ఉండిపోయావు. ఒంటరితనంతో స్నేహం చేసావు. నీలోని క్రియేటివ్ ఎనర్జీ పోతున్నది ఇక్కడే. నీలో ఓ సృజనాత్మకత ఉందన్న సంగతి కూడా మర్చిపోయావు. ఇవన్నీ నీకు తెలీకుండా జరిగిపోతోంది.

శృతీ నీలో సృజనాత్మకత ఉంది. అది నువ్వు రాసిన ఉత్తరంతో ,పెయింటింగ్ తో తెలుస్తోంది. దీనితో నీకు ఇంకో విషయం కూడా చెప్పాలి.ఈ క్రయేటివిటీ అన్నది,ఒక్కొక్క సారి నీ డిసార్డర్ కి సంబంధించినది. ఇది యూనిక్.

శృతీ నీకు దేవుడు ఓ శక్తినచ్చాడు . మామూలు వాళ్ళకి లేనిది. అది నీలో ఉంది. నీకు తొందరగా ఇమోషన్స్ వచ్చెస్తాయి. ఆ ఇమోషన్స్ కి ఓ రూపం ఇచ్చుకో గలిగే శక్తి కూడా నీలో ఉంది.

ఓ సారి చరిత్ర తీసుకుంటే ఎన్నో ఉదాహరణలున్నాయి. ఇలా డిప్రెషన్ తో బాధపడే వాళ్ళల్లో రచయితలున్నారు. చిత్రకారులున్నారు.అయితే వాళ్ళు ఈ సమాజానికి ఎంతో విలువైనవి అందించారు.

అందుకని వాళ్ళు ఆ భావాలని కాగితం మీద కాని,రంగుల్లో కాని వ్యక్తీకరించారు. నీకు విన్సెంట్ వాన్ గో తెలుసా. అతని పేరు విన్నావా " డాక్టరు గారి గొంతు చాలా మృదువుగా ఉంది. ఆ గొంతులోని ఆ మార్దవం ,మృదుత్వం,అంటే నాకిష్టం.

" వాంగో తెలీకపోవడం ఏంటండి డాక్టరుగారు,నాకు బాగా తెలుసు. అతని చిత్రాలని గురించి ప్రద్యుమ్న చెప్పాడు. ఆయన వేసిన పెయింటింగ్ లు చూపించాడు. ఆయన ఎంత బీదరికంతో బతికాడో అన్నీ చెప్పాడు. ఆయన బతికి ఉన్నప్పుడు ,అతని పెయింటింగ్ లు ఒక్కటి కూడా అమ్ముడు పోలేదు కాని అతను పోయాకా వాటికి మిలియన్స్ వచ్చాయి అని కూడా చెప్పాడు " ఉత్సాహంగా అన్నాను.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments